# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజల సహకారంతో 'మన్ కీ బాత్' కార్యక్రమం విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **'స్వచ్ఛ భారత్ మిషన్' విజయంతో 'వ్యర్థాల నుండి సంపద' అనే మంత్రం ప్రజల్లో ప్రాచుర్యం పొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
3. **సామూహిక ప్రజల భాగస్వామ్యానికి 'ఏక్ పేడ్ మా కే నామ్'- అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం ప్రతీకగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
4. **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో పారదర్శకంగా బదిలీలు చేపట్టామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
5. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డి.వై.చంద్రచూడ్ ఈరోజు దర్శించుకున్నారు.**

==========================

ప్రజల సహకారంతో 'మన్ కీ బాత్' కార్యక్రమం విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధానమంత్రి తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 114వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది అక్టోబర్ 3వ తేదీన 'మన్ కీ బాత్' కార్యక్రమానికి పదేళ్లు పూర్తి అవుతాయని తెలిపారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలు, విషయాలు, కొత్త గాథలు, కొత్త రికార్డులు, కొత్త వ్యక్తులను జోడించేవిధంగా 'మన్ కీ బాత్' ఒక ధారావాహికను సృష్టించిందని చెప్పారు. సమాజంలోని వ్యక్తులు సామూహిక స్ఫూర్తితో ఏ పని చేసినా వారికి 'మన్ కీ బాత్' ద్వారా గౌరవం లభిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 33 సెకన్లు)

--------------------------

'స్వచ్ఛ భారత్ మిషన్' విజయంతో 'వ్యర్థాల నుండి సంపద' అనే మంత్రం ప్రజల్లో ప్రాచుర్యం పొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈ ఉ దయం ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, 'రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్' గురించి ప్రజల్లో అవగాహనా పెరిగిందని తెలిపారు.

పరిశుభ్రత కోసం జరుగుతున్న ప్రచారంలో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని అన్నారు. 'స్వచ్ఛత' కోసం కుటుంబసభ్యులు, స్నేహితులు, పొరుగువారు లేదా సహోద్యోగులతో కలిసి పరిశుభ్రత ప్రచారంలో పాల్గొనాలని కోరారు. 'స్వచ్ఛ భారత్ మిషన్' విజయవంతం అయిన సందర్భంగా ప్రధానమంత్రి ప్రజలందరికీ అభినందనలు తెలియజేశారు.

--------------------------

సామూహిక ప్రజల భాగస్వామ్యానికి 'ఏక్ పేడ్ మా కే నామ్'– అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం స్ఫూర్తిదాయకమైన ప్రతీకగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం గురించి ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభించిన ఈ ప్రచారంలో దేశంలోని నలుమూలల ప్రజలు పాల్గొంటున్నారని చెప్పారు. తెలంగాణకు చెందిన కె.ఎన్.రాజశేఖర్ రోజూ ఓ మొక్క తప్పకుండా నాటాలని నిర్ణయించుకుని 1500కు పైగా మొక్కలు నాటారని తెలిపారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రజా ఉద్యమంలో అందరూ పాల్గొనాలని ప్రధానమంత్రి కోరుతూ,

వాయిస్ ( 35 సెకన్లు)

--------------------------

ప్రతిభను, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'క్రియేట్ ఇన్ ఇండియా' అనే ఇతివృత్తంతో 25 సవాళ్లను ప్రారంభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా ఉద్యోగాల స్వభావాలు మారుతున్నాయని, గేమింగ్, యానిమేషన్, రీల్ మేకింగ్, ఫిల్మ్ మేకింగ్, పోస్టర్ మేకింగ్ వంటి రంగాలు విస్తరిస్తున్నాయన్నారు. ఆయా రంగాల్లో నైపుణ్యాలను, సృజనాత్మకతనుప్రదర్శించుకునేందుకు 'క్రియేట్ ఇన్ ఇండియా' పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకోసం wavesindia.org వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

--------------------------

భారతదేశం తయారీ రంగానికి కేంద్రంగా మారడానికి 'మేక్ ఇన్ ఇండియా' కీలక పాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈ నెలతో 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారానికి 10 సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రచారం విజయవంతం కావడంలో దేశంలోని పెద్ద పరిశ్రమల నుండి చిన్న దుకాణదారుల వరకు ప్రతి ఒక్కరి సహకారం ఉందని అన్నారు. దేశ యువ శక్తి కారణంగా యావత్ ప్రపంచం దృష్టి భారత్ పై ఉందని, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, విమానయానం, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఇలా అన్ని రంగాలలో దేశ ఎగుమతులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. దేశంలో నిరంతరంగా పెరుగుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 'మేక్ ఇన్ ఇండియా' విజయగాథను తెలుపుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 36 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖలో పారదర్శకంగా బదిలీలు చేపట్టామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల ప్రతిభ, సమర్థత, నిబంధనలు కొలమానాలుగా బదిలీలు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రుల నుంచి వచ్చిన సిఫార్సులు కూడా నిర్దేశించుకున్న కొలమానాలకు అనుగుణంగా ఉంటేనే పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న చంద్రచూడ్‌కు టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం చంద్రచూడ్ దంపతులను ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. స్వామివారి దర్శనం తర్వాత తిరుపతికి చేరుకుని అలిపిరి వద్దనున్న గోశాలను సందర్శించి, గోశాలలోని శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరుకుని ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. "జాతీయ పోషకాహార మిషన్" అని కూడా పిలిచే ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 18వ తేదీన ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా చేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

కాగా.. పోషకాహార మాసోత్సవంపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు సాయంత్రం 4 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష – టెట్‌కు దరఖాస్తు చేసిన వారిలో ఇప్పటి వరకు 94.30% మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మొత్తం 4,27,300 మంది దరఖాస్తు చేయగా.. 4 లక్షల 2 వేల 935 మంది హాల్‌టికెట్లు పొందారని, మిగిలిన వారూ వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

---------------------------

రాష్ట్రంలో సులభతర వాణిజ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరంను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ జీవోను విడుదల చేసింది. ఫోరం ఛైర్మన్‌గా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వ్యవహరించనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా ఈ ఫోరం పనిచేయనుందని తెలిపింది. ప్రభుత్వశాఖలను రియల్ టైం గవర్నెన్స్– ఆర్టీజీఎస్ శాఖ సమన్వయం చేయనుందని పరిశ్రమల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

=====================